# సిన్నసిన్న ఆశలు

కొలిం[1] జమాల్ అంటే బారీ మనిసి అనుకుంటారేమో. అదేంగాదు, పిట్టంత మనిషి. సింపిరి జుట్టుతో, పుల్ల మీసాల్తో సోలాడ్తా వుంటాడు. జమాల్ పెండ్లాం మటుకు జమాల్ జమాల్‌మంటా ఇంతెత్తునా, ఇంతలావునా దర్జాగా వుంటాది. ఆమె పొలంపనులకు పోతా వుంటాది గానీ, జమాల్ కొలింపని తప్ప ఇంగేపనీ సెయ్యడు. కొలింపని ఏడాది పొడుగునా వుండదు. వూళ్లల్లో ఏడాది పొడుగునా యాపని వుంటాదిలే. వానలు గుర్సి, సేజ్యాలు మొదలైతాయే ఆ నాల్రోజులూ కొలింపని కసాలగా[2] వుంటాది.

ఏటివార్న, జవితి కట్టమీద జీవి[3] సెట్టు కింద జమాల్ కొలింపెడ్తాడు. అక్కడుండేబండ్లను ఆపక్కకూ, ఈ పక్కకూ తోసి, దుమ్మూ కసువూ సుబ్బరంగా వూడ్సి, నీల్లు జల్లి, కొలింగుంత తొగి, ఆ గుంతలోకి దిగేట్టుగా సిత్తుల గొట్టాలు పెట్టి, గోనెసంచుల్లో వరిపొట్టుపెట్టుకుని, కొలింపెడ్తాడు. అప్పటికే రైతులంతా బండి ఇర్సులూ, గుంటికెపలుగులూ, మడక కఱ్ఱులూ, తెచ్చి, జీవిసెట్టు సుట్టూవుండే అరుగుపక్కన పెట్టి, అరుగుమీన కూచ్చోనుంటారు. ఎండలో తలతలమెరిసే జీవిసెట్టు ఆకుల్లో నుంచి సిలకలుకొరికిన జీవిపళ్లు అందరిమీదా రాల్తావుంటాయి. "జమాల్, నాపని సూడు" అంటే "నాపని సూడు" అంటా తొందరపెడ్తారు. కొందరైతే, పలానాసేనికి పొద్దన్నేపోవాల జమాల్... అంటా ఉబ్బిస్తా సెప్తారు." అందరి పనీ సేస్తా, అందుకే కొలింపెట్టింది." అని జమాల్ నిబ్బరంగా సెప్తాడు. కొందరైతే, కమ్ములొదిల్న బండిగాన్లను[4] దొర్లిచ్చుకుంటా వస్తారు కొలింకాడికి. గాన్లను దొర్లిచ్చుకుంటా రావడం మాపిల్లోల్లకు శానా బాగుండేది. నగుతా ఎనకంబడీ మేమూ పరిగెత్తుకుంటా వచ్చేవాళ్లం. బండిగాన్లకు కమ్ములు కట్టడం అనేది కొలిందగ్గరసేసే పనిగాదు. జవితికట్ట దిగవన ఏట్లో కమ్ములసుట్టూ వరిపొట్టూ, బొనిగెలూ[5] కప్పి, కమ్ముల్ని కాల్చిగాన్లకు కట్టాల.

జమాల్ పిట్టంతమనిసి అని సెప్తి గదా... కొలిం దగ్గరున్నప్పుడు సెట్టంతమనిసి అయిపోతాడు. సెట్టంత అయితాడనిగాదు. అయినట్టు కనిపిస్తాడు. బండి ఇర్సును ఎడంసేత్తో యిసిరేస్తాడు. ఇర్సు మీద మొద్దోడు సేతులెత్తునా ఎత్తి సమ్మెట ఏస్తావుంటే, ఒక సేత్తో బీడీ తాగుతా, ఇంగో సేత పట్టకార్తో దిమ్మె మీద ఇర్సును బెసక్కుండా[6] పట్టుకుంటాడు. పైగా, "సచ్చునాయాలా, ఏందిరా ఆ సమ్మెట యెయ్యడం" అంట ఎగతాలిసేస్తావుంటాడు. ఉత్తప్పుడు వూగులాడ్తావుండే జమాల్‌కు అంత శకితి ఎట్లా వచ్చేదో తెల్దు. అదట్టవుండనీ గానీ, ఎఱ్ఱగా కాలిన ఇనుంమీన సమ్మెట దెబ్బపడినప్పుడు నిప్పురవ్వలు ఎగిరిపడటమూ, కొలింసిత్తులు[7] రొండు సేతుల్తో నొక్కుతావున్నెప్పుడు కొలింలో నుంచీ పూలు పూలుగా ఎగరడమూ మాకు శానా బాగుండేది.

అంతకంటే ఇంగోటి ఇంగా బాగుండేది. కొలింసిత్తులు వూదే రసూల్ సిన్న అరుగుమీద పర్సిన బొంతమీన కూచ్చొని వూత్తావుండేవాడు. అక్కడ కూచ్చోని వూదాలని మాపానం కొట్టకలాడేది. అదికనిపెట్టి "తొక్కుతారా, నువులేరా రసూల్" అనేవాడు జమాల్. అదిమాసేత

---

1) కొలిమి 2) వత్తిడితో 3) జువ్విచెట్టు 4) చక్రాలను 5) ఎండిన పేడ పలుకులు
6) కదలకుండా 7) తిత్తులు

అయ్యేదిగాదు,కొలింబాగా మండేది కాదు."తియ్యండి,తియ్యండి,అమ్మకడుపునిండా బువ్వపెట్టలేదా"అని జమాల్‌నగేవాడు. ఎప్పటికైనాసరే,కొలింసిత్తుల్ని బుస్‌బుస్‌మనిసిస్తా, ఆ అరుగుమీన కూచ్చేని తొక్కాలనేది మాకోరిక. జమాల్ బావమర్దికి పొద్దుటూర్లో ఏదో నౌకరీ." ఈ కొలింపని ఎన్నాల్లంట సేస్తావు.పొద్దుటూరికిరా, ఏ ఆపీసులోనన్నా నౌకరీ ఇప్పిస్తా" అనేవాడు.జమాల్ పెండ్లాం కొట్లాడేది,పోదామని."నాపేరు కొలింజమాల్. ఈపేరు మార్చుకోను"అనె జమాల్.

జమాల్‌కత అట్టయితే,పెన్నేటిజవితికట్టమీద,జీవిసెట్టుకింద, ఆసిన్నరుగుమీన కూచోని, కొలింసిత్తులు తొక్కి జమాల్‌ను మెప్పిచ్చాలన్న నా కోరిక తీరలేదు. ఇంగెప్పటికీ తీరదు. అట్టాటియే ఇంగా కొన్ని ఆశలున్నాయి. ఎక్కువసెప్తే యిసుగొస్తాది కనుక ఒక టొండుసెప్తా.' అంకట్ట'కతలో సుబ్బయ్యతాతను గురిచ్చి సెప్తిగదా ... ఆయన మనవడే నారాయన.నారాయన నాకంటే అయిదారేండ్లు పెద్ద.అయినా నాతోటోళ్లతో ఏట్లో బలిగుడు ఆడేవాడు, గోలిగుండ్లూ,పుట్టచెండ్లూ ఆడేవాడు. సుబ్బయ్యతాత "కుమ్మరిపని నేర్సుకోరా"అని నారాయన్ను తిట్టేవాడు.అప్పటికి నారాయన కుమ్మరిపనినేర్సుకోలేదుగానీ, సారెతిప్పేది నేర్సుకున్నాడు.అదేమాకు అచ్చెర్యంగా కనిపిచ్చేది.ఎట్టంటే సెప్తా.

సారెమీన కట్టెబెట్టి యిస్పీడుగా తిప్పడానికి,దానిమీనగోలిగుండ్లబద్దికన్నా సిన్నదిగా బొటికెన ఏలుపట్టేంతగుంతవుంటాది.సారెతిరగనప్పుడు సూస్తేనే అది కనపడేది,తిరిగేతప్పుడు కనపడదు.ముందుగాసేత్తో సారెను తిప్పుతారు. అప్పటికే రయ్యిన తిరుగుతావుంటాది, అప్పటికే సారెనపడకుండా వుంటాది. అట్టా కనపడకుండా తిరిగే సారె మీన వుండే ఆసిన్నగుంతలో బారెడుకు పైగావుండే కట్టెపెట్టి, సేతిపొడుగునా ఇంగా రయ్యిరయ్యిన తిప్పుతాడు నారాయన. అట్టా తిరిగే సారెదగ్గరమోకాళ్లు వంచి,సారెమీనవుండే తడిమట్టిని రెండుసేతుల్తో వత్తుతావత్తుతా ఏనిగంతవుండే వాడదగ్గర్నించీ,ఎలకంతవుండే పిడతల్దాకాసేస్తాడు సుబ్బయ్యతాత.పొరపాట్న మోకాళ్లుగానీ సారెకు తగిల్నాయంటే మోకాలు సిప్పలు ఎగిరిపోవాల్సిందే. ఎన్నో ఏండ్లసర్వీసున్న[1] సుబ్బయ్యతాత సెయ్యడంలో సిత్రంలేదుగానీ,మాతోపాటుగోలిగుండ్లు ఆడేనారాయన అట్టాసారెతిప్పడం ఎట్టానేర్చుకున్నాడా అన్నదే సిత్రం. మల్లాసారెనిదానంగా తిరిగే తప్పుడుసూసి,గుంతలో కట్టెపెట్టి తిప్పుతాడా? ల్యా. సారెకండ్లక్కనపడకుండా తిరిగే తప్పుడు కట్టెలటక్కున గుంతలో ఏస్తాడు! నారాయన్ను బంగపోయిమేమూ అట్ట ఎయ్యాలని సూసినాం. వుహూ... సారె నిదానంగా తిరిగే తప్పుడు కూడా యెయ్యలేకపోతిమి.

అప్పట్నించీ నారాయన్ను ఆచ్చెర్యంగా సూసేవాళ్లం.నారాయనసేతినీ,సేతిలోని కట్టెనూ,సారె మీన గుంతనూపట్టిపట్టి సూసేవాళ్లం. ఏమీ అర్తమయ్యేదిగాదు."ఏదన్నా మంత్రమా?"అని అడిగినాం.సుబ్బయ్యతాత యిన్నెట్టుంది, "అవు, మంత్రమే. కుమ్మరి మంత్రం" అని నగినాడు. కొలిం దగ్గరున్నప్పుడు పిట్టంత జమాల్ సెట్టంతకావడం కమ్మరిమంత్రమైతే, ఇది కుమ్మరి మంత్రం కావాల. గానిగ[2] ఈరన్నది ఇంగోమంత్రం. ఈరన్నగానిగ కొట్టంవూరికి రోంత ఎడంగా వుంటాది. ఎడంగావున్నా, సమురు వొండుతా వున్నెప్పుడూ,గానిగ రోట్లో సెక్కకదిలిస్తా గానిగ అడ్డావుండే తప్పుడూ, వాసన గమాలిస్తా వూరి దాకా వస్తానే వుంటాది. మధ్యాహ్నం గానిగ కొట్టం సల్లగా, కమ్మని వాసనొస్తా శానా

1) సర్వీసున్న 2) గానుగ

బాగుంటాది. అదేగాదు, ఈరన్న పిల్లోల్లను గానిగ బండమీన కూచ్చోబెట్టి తిప్పుతాడు. ఉత్తపెయిన, మోకాళ్లకాడికుండే సల్లాడం[1] తొడుక్కొని, సిన్న కఱ్రపట్టుకొని రోట్లో ఆంద్యాల[2] సెక్కను కలబెడ్తా ఈరన్నగుడకా ఎద్దాల తిరుగుతావుంటాడు. ఎద్దేమో,కండ్లకు తోలు గంతలుకట్టుకోని,కట్టుకోని అంటే అది కట్టుకున్యాదనికాదు. ఈరన్నే కట్తాడులే, ఆ...తోలు గంతలు కట్టుకోని,తోకలేపి ఈగల్ని తోలుకుంటా మెల్లింగా తిరుగుతావుంటాది. బండమీన ఒక్కోసారి ఇద్దరం ముగ్గురంకూచ్చుంటాం.

అట్టకూచ్చున్నా, సమురువొండుతా అట్టాయిట్టాతిరుగుతా వుండే ఈరన్న పెండ్లాం మమ్మల్నేమనదు. ఎద్దేమో "కూచ్చోండి, గానిగెద్దుకు బరువేంది, అలకనేంది"[3] అన్నెట్టు తిరుగుతా వుంటాది. ఎంతమంది కూచ్చున్నా సూదనట్టే తిరుగుతా వుంటాదా, ఈరన్నరోటికాన్నుంచీ రోంత పక్కకు కదుల్తానే,నిలబడ్తాది. " ఆయ్, వూయ్... తిరుగు,తిరుగు" అని మేం ఎంత మొత్తుకున్నా కదల్దు. ఈరన్న మల్లారోటికాడికొస్తానే తిరగడం మొదలు పెడ్తాది. ఈరన్న రోటికాడ ఉండేదీ, లేందీ దానికెట్టా తెలుసు?కండ్లు తెర్సిసూడదు, సూసినా గంతులుండే. మల్లఎట్టకనుక్కుంటాది? ఈరన్న "పా...పా" అనిఅర్సడు. రిక్కగూడా కొట్టడు.అడుగుల సప్పుడు కూడా వుండదు.

"నువుండేదీ, లేందీ దానికెట్టతెల్సు"అనడిగినాం.

"తెల్సు" "ఎట్టంటే...?"

"ఎట్టంటే అట్టనే.అదిగానిగోడికీ,గానిగెద్దుకూ తెల్సు.మీకు తెల్దు."

" ఓర్నీ... ఇదిగూడా మంత్రమేనా?" అనుకుంటిమి.వాళ్లనింగా మర్సిపోకుండా వుండడం కూడా మంత్రమో, వాళ్లమయిమో[4] మల్ల!

అది సరేగానీ, అట్టకొలింసిత్తులు వూత్తా,ఏటిదిక్కుసూస్తాకూచ్చోవాలనీ,ఎట్టయిన సారెమీన గుంతలో కట్టెఏసి రయ్యిన తిప్పాలనీ,గానిగబండమీన కూచ్చోని తిరగాలనీ ఇప్పటికీ అనిపిస్తాది.అయి సిన్నసిన్న ఆశలే. సిన్నయేనా?పెద్దపెద్ద ఆశలు తీరినా, ఇయి తీరేటియికాదుగనక శానా పెద్దయనుకోవాల్నా? నా సిన్న సిన్న ఆశలన్నీ సిన్నతనం మీద ఆశలే గానీ, ఊరి మీద ఆశలు కాదనుకోవాల్నా ?

---

1) నిక్కరు 2) ఆముదాల 3) తేలికేంది 4) మహిమో